ముంబయి జాతీయ రహదారిపై ఉన్న ఓ ఫ్లైఓవర్‌కు రజతోత్సవ సభ వాల్ రైటింగ్

ఆకట్టుకుంటున్న వాల్‌రైటింగ్స్

మునిపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని దారుల వెంట వాల్‌రైటింగ్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడ చూసిన కేసీఆర్ పేరు..ఏ గోడకు చూసినా చలో వరంగల్ అంటూ రాతలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి అంటూ కేసీఆర్ పేర్లు రాయడంతో ప్రజలంతా వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, ఏప్రిల్ 23: ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కంది మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని, వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న కాశీనాథ్‌ను అభినందించారు. అనంతరం పాఠశాల విద్యా విధానంపై రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అఘోరీకి జైల్ అధికారుల షాక్

- ఏ బ్యారక్‌లో ఉంచాలో తెలియక తిరిగి పంపిన అధికారులు

కంది, ఏప్రిల్ 23: చీటింగ్ కేసులో అరెస్టయిన అఘోరీ అలియాస్ శ్రీనివాస్ కేసు సంచలనం రేపుతున్నది. చేవెళ్ల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో రంగారెడ్డి పోలీసులు బుధవారం సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైల్‌కు అఘోరీని తరలించారు. ఆడ, మగ తెలియకుండా అఘోరీని జైల్లో ఏ బ్యారక్‌లో ఉంచాలో జైల్ అధికారులకు అర్థంకాలేదు. లింగనిర్ధారణ జరిగితే గానీ ఇక్కడి జైల్లో ఉంచుకోలేమని చెప్పడంతో తిరిగి అఘోరీని కోర్టుకు పంపించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు చేవెళ్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్యుల నివేదిక ఆధారంగా పోలీసులు ఏ జైలుకు తరలించాలో నిర్ణయం తీసుకోనున్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు

మాట్లాడుతున్న శివప్రసాద్

జహీరాబాద్, ఏప్రిల్ 23: ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు అమ్మితే కఠినే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖాధికారి శివప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ రైతు వేదికలో జహీరాబాద్ డివిజన్ పరిధిలోని అధీకృత డీలర్ల సమావేశంలో ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులను రైతులకు విక్రయించాలన్నారు. వాటికి సంబంధించిన ఇన్‌వాయిస్, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులకు విక్రయ రసీదులను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, వ్యవసాయాధికారులు లావణ్య, అవినాష్‌వర్మ, హుసుద్దీన్, వినోద్ కుమార్, వెంకటేశ్వర్లు, ఏఈవో ప్రదీప్‌కుమార్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐదేండ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి

రికార్డులు పరిశీలిస్తున్న గాయత్రిదేవి

హత్నూర, ఏప్రిల్ 23: ఐదేండ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి సూచించారు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా బుధవారం హత్నూర మండలం చింతల్‌చెరు, దౌల్తాబాద్ ప్రభుత్వ దవాఖానలను ఆమె సందర్శించి వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. ఈనెల 28వరకు ఇంద్రధనస్సు కార్యక్రమం కొనసాగుతుందని, చిన్ననాటి నుంచి టీకాలు వేయించని పిల్లలను గుర్తించి వారికి తప్పనిసరిగా వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రగతి పత్రాల అందజేత

ప్రగతి పత్రాలను అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కోహీర్, ఏప్రిల్ 23 : మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం ప్రగతి పత్రాలను అందజేశారు. పాఠశాలకు వేసవి సెలవుల ప్రారంభం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి మరో విద్యార్థిని పాఠశాల్లో చేర్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతిపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: హోమియోపతి విభాగం ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాజంపేట, సోమేశ్వరవాడ, రిక్షా కాలనీ తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్యం, యోగా, హోమియోపతి మందుల వినియోగం, రోజువారి దినచర్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్మదా, యోగా ట్రైనర్ అజయ్, సురేష్, ఫార్మసిస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అందోల్, ఏప్రిల్ 23: మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. బుధవారం జోగిపేటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మికులకు న్యాయమైన హక్కులు దక్కాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షులు విద్యాసాగర్, నాయకులు కృష్ణ, రాములు, సురేశ్, ప్రభాకర్, నగేశ్, రాజు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి

- జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన హిందూ ధార్మిక సంఘాలు

సంగారెడ్డి కలెక్టరేట్: ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్: ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలో నిరసన చేపట్టారు. స్థానిక ఐబీ నుంచి కొత్త బస్టాండు వరకు ఉగ్రవాదుల దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండు వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రాజు గౌడ్, మందుల నాగరాజు, కసిని వాసు, ద్వారక రవి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ముందు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కోర్టు ముందుగల ప్రధాన రహదారిపై ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

జహీరాబాద్, ఏప్రిల్ 23: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు చనిపోవడం బాధాకరమని జహీరాబాద్ పట్టణ ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం స్థానిక ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ కార్యాలయంలో మృతులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ సభ్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

రామచంద్రాపురం, ఏప్రిల్ 23: జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా తెల్లాపూర్‌లోని ఏలియన్స్ సర్కిల్ వద్ద బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో టీనా అధ్యక్షుడు రమణ, గేటెడ్ కమ్యూనిటీ వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఝరాసంగంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఝరాసంగం, ఏప్రిల్ 23: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి మానవత్వానికి మాయని మచ్చని ఝరాసంగం హిందూ ధార్మిక సంఘం ప్రతినిధులు ఖండించారు. ఉగ్రదాడిలో మరణించిన మృతులకు నివాళులు అర్పిస్తూ హిందూ ధార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ, రాజేందర్ సింగ్, శ్రీనివాస్, నాగన్న, సంగమేశ్వర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, వీరేశం, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

సిరిపురలో కొవ్వొత్తుల ర్యాలీ

హత్నూర, ఏప్రిల్ 22: హత్నూర మండలం సిరిపురలో బుధవారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో నుండి బస్టాప్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేసి ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు.

జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్‌లో..

జహీరాబాద్/ఝరాసంగం, ఏప్రిల్ 23: జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం పట్టణ, మండల కేంద్రాల్లో హిందూ ధార్మిక సంఘం ఆధ్వర్యంలో జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నిరసనగా బుధవారం రాత్రి క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. జహీరాబాద్, మండల కేంద్రాలైన ఝరాసంగం, న్యాల్‌కల్ గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా హిందూ ధార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, హిందూ ధార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు

ఝరాసంగంలో క్యాండిల్ ర్యాలీలో హిందూ ధార్మిక సంఘం నాయకులు

న్యాల్‌కల్‌లో క్యాండిల్ ర్యాలీలోహిందూ ధార్మిక సంఘం నాయకులు

బొంతపల్లి వద్ద తీవ్ర ఉద్రిక్తత

- ఇరువర్గాల ఆందోళన

బొంతపల్లి ప్రధాన రహదారిపై ధర్నాకు దిగిన ఓ వర్గం

గుమ్మడిదల, ఏప్రిల్ 23: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో శివుడి మట్టి విగ్రహం ధ్వంసం ఘటనతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఓ వర్గానికి మద్దతుగా హైదరాబాద్ నుంచి బుధవారం వంద మందికిపైగా గుమ్మడిదల మండలం బొంతపల్లి కమాన్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారు దాయాది దేశం జిందాబాద్ అంటూ బొంతపల్లి హైవేపై నినాదాలు చేసి ఆందోళనకు దిగారు. ఇది గమనించిన మరో వర్గం వారు వారికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుని రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని ఓవర్గం వారు భారీ సంఖ్యలో హైవేకు చేరుకొని మూడు గంటల పాటు ధరా, రాస్తారోకో చేశారు.నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. అయినప్పటికీ ఓ వర్గం వారు ఆందోళన విరమించకుండా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఆందోళనతో మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

గురుకుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

జహీరాబాద్, ఏప్రిల్ 23: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతి(కే) తెలంగాణ బాలికల గురుకుల కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ర్యాంకులు సాధించి సత్తాచాటారు. కళాశాలకు చెందిన ఎంపీసీ ప్రథమ సంవత్సర విద్యార్థినులు ఎ.గాయత్రికి, టి.ఐశ్వర్యకు 468/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. టి.నిఖిత, ఎం.అరవింద, ఎం.స్నేహకు 467/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎం.పూజ 466/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపకులు,తల్లిదండ్రులు అభినందించారు.

దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

- ఎన్‌పీఆర్డీవో జాతీయ అధ్యక్షుడు రాజేందర్

మాట్లాడుతున్న తుడుం రాజేందర్, నాయకులు

పుల్కల్, ఏప్రిల్ 23: రాజకీయాల్లోనూ దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని ఎన్‌పీఆర్డీ జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పుల్కల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ తరహాలో తెలంగాణలోనూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తీవ్రమైన దివ్యాంగులకు వికలాంగులను నెలకు రూ.15 వేల పెన్షన్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. మే 23 నుంచి 25 వరకు వరంగల్‌లో మూడురోజుల పాటు రాష్ట్ర మహాసభలకు దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో షఫీ, మల్లికార్జున్, కుమార్, వెంకన్న, భిక్షపతి యాదవ్, బాబురావ్, ప్రవీణ్, శబరి చావ్లా, నర్సింగ్ పాల్గొన్నారు.

పరిశ్రమ వ్యర్థాల డంపింగ్

- అడ్డుకున్న ముత్తంగివాసులు

ముత్తంగిలో పారవేసేందుకు ట్రాలీ ఆటోలో తీసుకొన్నిన వ్యర్థాలు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 23: పాశమైలారం పారిశ్రామికవాడలోని పరిశ్రమ వ్యర్థాలను ముత్తంగిలో డంప్ చేస్తుండగా బుధవారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకుని తెల్లాపూర్ మున్సిపల్ అధికారులకు అప్పగించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలో సుచిర్ ఇండియా వెంచర్ ముందున్న జేసీబీ గుంతల్లో ఐడీఏ పాశమైలారం స్పాండిక్స్ పరిశ్రమ సిబ్బంది ట్రాలీ వాహనంలో తెచ్చి వ్యర్థాలను పారవేస్తున్నారు. డ్రమ్ముల్లో వ్యర్థాలను, బ్యాగుల్లో తెచ్చిన పరిశ్రమ వేస్టేజీని ఖాళీ చేస్తున్నారు. అది గమనించిన రామకృష్ణ ముదిరాజ్, గ్రామస్తులతో కలిసి ఆ ట్రాలీని పట్టుకుని మున్సిపల్, పీసీబీ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వ్యర్థాలను ఇక్కడ ఎలా పారవేస్తారని ట్రాలీతో పాటు వచ్చిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే డొమెస్టిక్ వేస్టేజీతో గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, పరిశ్రమల వ్యర్థాలు కూడా పారవేస్తే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని మండిపడ్డారు. ఫిర్యాదుపై అక్కడికి చేరుకున్న తెల్లాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది ఆ వాహనాన్ని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. పీసీబీ శాఖ ఆర్‌వో గీత పరిశ్రమ ట్రాలీలో తెచ్చిన వ్యర్థాల శాంపిల్స్ సేకరించి రిపోర్టుకు పంపిస్తామని ఫోన్‌లో తెలిపినట్టు రామకృష్ణ వివరించారు. పరిశ్రమ వ్యర్థాలను పారవేయడం తప్పని, జరిమానాలు విధిస్తామని, పరిశ్రమ వ్యర్థాలపై పీసీబీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు.

భూభారతితో రైతులకు సత్వర న్యాయం

కంది: మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, ఏప్రిల్ 23: భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పిలుపునిచ్చారు. భూ భారతితో రైతులకు సత్వర న్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. బుధవారం కంది రైతు వేదిక వద్ద భూభారతి-2025 చట్టంపై అవగాహన సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. భూభారతితో రైతుల భూసమస్యలు సులభంగా పరిష్కారమం అవుతాయన్నారు. రికార్డుల్లో పేరు మార్పు, నూతన పౌతి లాంటివి 30 రోజుల్లో పరిష్కారం అవుతాయని, భూరికార్డుల్లో పేరు మార్పిడి కోసం నూతన నోటీసు విధానం అమల్లో ఉందని తెలిపారు. భూ సమస్యలపై సివిల్ కోర్టుకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులే పరిష్కరించేలా, రైతు భూమి ఎక్కడుందో సర్వేయర్ చూసి చెప్పేవిధంగా భూభారతి ఉందన్నారు. భూభారతి చట్టంపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

భూభారతిని సద్వినియోగం చేసుకోవాలి

మునిపల్లి, ఏప్రిల్ 23: ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు.బుధవారం మునిపల్లి తహసీల్ కార్యాలయం వెనుక భాగంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా సులభంగా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో హరినందన్‌రావు, రసూల్ పటేల్, మక్సుద్ పటేల్, రైతులు పాల్గొన్నారు.

సజావుగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలు బుధవారం నాలుగో రోజు సజావుగా జరిగాయి. ఓపెన్ స్కూల్ పదో తరగతికి ఉదయం జరిగిన సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 2043 మంది అభ్యాసకులకు, 1866 మంది హాజరుకాగా, 91శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన హిందీ పరీక్షకు 316 మందికి 287 మంది హాజరుకాగా, 91శాతం హాజరు నమోదైంది. ఇంటర్ పరీక్షలకు ఉదయం జరిగిన కామర్స్, బిజినెస్ స్టడీస్ పరీక్షకు 2,558 మంది అభ్యాసకులకు 2356 మంది హాజరుకాగా, 92 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన ఫిజిక్స్, సైకాలజీ పరీక్షకు 904 మందికి 841 మంది అభ్యాసకులు హాజరుకాగా, 93 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల కమిటీ పర్యవేక్షించింది. ఎలాంటి మాల్‌ప్రాక్టీసింగ్ కేసు నమోదు కాలేదని డీఈవో వెల్లడించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులు

మాదారంలో గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న అధికారి సైదులు

జిన్నారం, ఏప్రిల్ 23: కంకర క్రషర్లు, క్వారీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మండలంలోని మాదారం గ్రామస్తులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం జిల్లా మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులు గ్రామంలో పర్యటించి కంకర క్రషర్లు, క్వారీలను పరిశీలించారు. ప్రాజెక్టు ప్రతినిధులు సంబంధిత పత్రాలను జిల్లా మైనింగ్ ఉన్నతాధికారికి రిపోర్టు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పోరాట కమిటీ సభ్యులు మైన్స్ అధికారికి అక్రమ కంకర క్రషర్లు, క్వారీల నిర్వహణతో స్థానికంగా జరుగుతున్న నష్టాలను వివరించారు. నియమ నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పోరాట కమిటీ ప్రతినిధులు విజయ్ కుమార్ గౌడ్, రమణ సింగ్, సాయికుమార్, వికాస్ సింగ్, అనిల్ కుమార్, నితిన్, గోపి, రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

మాట్లాడుతున్న ఎంఎస్ రామయ్య కళాశాల రిసోర్స్ స్కాలర్ ప్రకాశ్

జహీరాబాద్, ఏప్రిల్ 23: చదువుతోనే ఉజ్వల భవిషత్తు లభిస్తుందని, పదో తరగతి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని బెంగళూర్‌లోని ఎంఎస్ రామయ్య కళాశాల రిసోర్స్ స్కాలర్ ప్రకాశ్ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థి దశలో పదోతరగతి, ఇంటర్ కీలకం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేశ్, విష్ణు, హారీశ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

మునిపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని పెద్ద గోపులారంలో నేడు కేసీఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం కానున్నది. టోర్నీ నిర్వహించే గ్రౌండ్ గులాబీజెండాలతో నిండిపోయింది. టోర్నీలో 50 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయి. గురువారం (నేడు) టోర్నీని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

కోహీర్, ఏప్రిల్ 23: కోహీర్ పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తామని తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు. భూభారతి చట్టంపై కలెక్టర్, ఉన్నతాధికారులు హాజరై వివరిస్తారని, రైతులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు నాగల్‌గిద్దలో..

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 23: భూభారతి చట్టంపై తహసీల్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శివకృష్ణా బుధవారం ప్రకటనలో తెలిపారు. అవగాహన సదస్సుకు కలెక్టర్ వల్లూరి క్రాంతి, డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఆర్డీవో అశోక్ చక్రవర్తి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి హాజరు కానున్నారని, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అవగాహన సదస్సుకు స్పందన కరువు

మునిపల్లి, ఏప్రిల్ 23 : మునిపల్లి రైతు వేదికలో బుధవారం నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు రైతుల నుంచి స్పందన కరువైంది. కార్యక్రమానికి కాంగ్రెస్ ముఖ్య నాయకులు సైతం గైహాజరయ్యారు. బ్యాసర్‌లో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఫొటో లేకపోవడంతో ఆయనతో పాటు కాంగ్రెస్ మండల ముఖ్య నాయకులు హాజరు కాకపోవడంతో హాట్ టాపిక్‌గా మారింది. కాగా, ఈ సదస్సుకు రైతులు తక్కువ.. నాయకులు ఎక్కువగా అ